



సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ అనురాధ

ఎన్నికల్లో లబ్ధి కోసమే

- సిఎఎపై పలువురి ఆగ్రహం - వ్యక్తమవుతున్న వ్యతిరేకత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల్లో లబ్ధి కోసమే పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (సిఎఎ)ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఎఎపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది...

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) మళ్లీ తెరపైకి తెచ్చింది. చట్టం అమలుకు నిబంధనలను కేంద్రం హోం మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫై చేసింది. కేరళతో సహా అయిదు రాష్ట్రాలు ఈ పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడానికి ముందే కేంద్రం సవరించిన సిఎఎ నిబంధనలను నోటిఫై చేయడంలో ఆంతర్యం తెలియనిదేమీ కాదు. ఫాసిస్టు హిందూత్వను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితోనే అది ఈ పని చేసింది. ముస్లింల పట్ల వివక్ష చూపే ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని 2019 డిసెంబరు 11న పార్లమెంటులో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య అత్యంత అప్రజాస్వామికమైన రీతిలో ఆమోదింప జేసుకుంది. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబరు 31 లేదా అంతకు ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి భారత దేశానికి వలసవచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వాన్ని మంజూరు చేస్తుంది. ముస్లింలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఎఎపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

ప్రజల దృష్టి మళ్లించడానికే



బిజెపి ప్రతి ఎన్నికలకు ముందు సమస్యల వైపు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఒక సెన్సేషనల్ సమస్యను ముందుకు తీసుకొస్తుంది. అలా ఈ సారి సిఎఎను ముందుకు తీసుకొచ్చింది. సరిహద్దు దేశాల నుంచి వలస వస్తున్న వారి నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నామని బయటికి చెబుతోంది. నిజానికి హిందూ ఓటర్లందరూ ఒక వైపునకు వచ్చేలా పోలరైజేషన్ చేస్తున్నారు. ముస్లింలను అణగదొక్కుతామని బహిరంగ సందేశం ఇస్తున్నారు. హిందూత్వ శక్తుల్లో ఉత్సాహాన్ని నింపి ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారు. సిఎఎ వల్ల ముస్లిములు ఇక్కడే పుట్టామని పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. ఇది సాధ్యం అవుతుందా? దానికి సంబంధించి ఎలాంటి ధృవపత్రాలు ఉండవు. జైళ్లలోని వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ముస్లిములను సతాయించడం సులభం అవుతుంది. ఎన్నికల బాండ్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కూడా సిఎఎను బిజెపి ఒక ఆయుధంగా ప్రయోగిస్తోంది.

- ఆచార్య మన్సూర్ రెహమాన్, ఆర్థికవేత్త

కేవలం ఓట్ల కోసమే సిఎఎ



దేశంలో ఉన్న ప్రజా సమస్యలపై ప్రజల వ్యతిరేకత నుండి దృష్టి మరల్చేందుకే పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో ఏదో ఒక సమస్య సృష్టించి పబ్బం గడుపుకోవడమే బిజెపి లక్ష్యం. దేశంలో నివసించే పౌరుల డేటా అంతా ఇంతకుముందే ఉంటుంది. ఈ రోజు కొత్తగా తమ నివాసాలను ధ్రువీకరించుకోవడం ఏం అవసరం ఉంది. ప్రశాంతంగా ఉన్న దేశంలో సిఎఎ అని మళ్లీ కొత్త రాగం, దానికి ప్రతిపక్షాలు వంత పాడటం ఎంత వరకు సబబు. సిఎఎను మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము.

-షేక్ బాబూలాల్, వైసిసి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రశాంతంగా ఉన్న దేశంలో చిచ్చు



ప్రశాంతంగా ఉన్న దేశంలో సిఏఏ మళ్లీ తెరపైకి తీసుకొచ్చి బిజెపి చిచ్చు పెడుతుంది. దేశంలో నివసించే ప్రతి పౌరుని యొక్క పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలు అన్ని ప్రభుత్వాల వద్ద ఉన్నాయి. మళ్లీ పౌరసత్వం నిరూపించుకోవాల్సిన అవసరం ఏముంది? బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా లౌకిక శక్తులు అందరూ కృషి చేయాలి. దేశవ్యాప్తంగా మైనార్టీల పైన జరుగుతున్న దాడులకు తోడు మైనార్టీల పట్ల వివక్షత చూపే విధంగా ఈ చట్టం ఉంది. రాష్ట్రంలో కూడా మైనార్టీల కోసం మా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని చెప్పాలి.

- మౌలాన అబ్దుల్ మజీద్, డబ్ల్యూహెచ్ఆర్‌సి నేషనల్ కన్వీనర్.

సిఎఎ రాజ్యాంగ విరుద్ధం



కేంద్రంలోని నరేంద్ర మోడీ భారత రాజ్యాంగానికి విరుద్ధంగా సిఎఎను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మైనార్టీల్లో ముస్లింలను మాత్రం పక్కన పెట్టి మిగతా వారందరికీ పౌరసత్వాన్ని ఇవ్వటం అంటే మతపరంగా హిందూ, ముస్లింలను చీల్చి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. భారత దేశంలో ఎక్కువ శాతం నిరుపేదలు చదువురాని వారు ఎక్కువగా ఉన్నారు. ఆధార్‌లోని తప్పులు సరిచేసుకోవాలంటేనే నానా తంటాలు పడాల్సి వస్తుంది. పొట్టకూటి కోసం కష్టపడే వారు పూర్వీకుల నుండి వారసత్వము తీసుకురావాలంటే ఎలా తీసుకురాగలరు. ప్రభుత్వం పునరాలోచించి మైనార్టీల అందరిని సమానంగా చూసి న్యాయం చేయాలి. సిఎఎను వెంటనే రద్దు చేయాలి.

- మహమ్మద్ పీర్, మైనార్టీ నాయకుడు, కర్నూలు.

సిఎఎ అమలు దుర్మార్గం



సిఎఎ అమలు దుర్మార్గం. లౌకిక సమాజాన్ని విభజించి, రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి చేస్తున్న కుట్ర. లోక్‌సభ ఎన్నికల తరుణంలో బిజెపి తన మతోన్మాద రూపాన్ని మరోమారు బహిర్గతపరుస్తోంది. మోడీ సర్కార్ ముస్లిం మైనారిటీలను అణచివేసే కుట్రతో సిఎఎ అమలుకు ఆఘమేఘాల మీద ప్రయత్నించడం దుర్మార్గం. మతపరమైన అంశాలతో ముడిపడి ఉన్న సిఎఎ చట్టాన్ని ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు, అనేక రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికలకు ముందు మతపరమైన, సున్నితమైన అంశమైన పౌరసత్వ సవరణ చట్టం అమలుకోసం బిజెపి చేస్తున్న కుయుక్తులపై రాష్ట్రంలోని టిడిపి, వైసిపి స్పందించి, తమ పార్టీల వైఖరిని స్పష్టం చేయాలి. ముస్లిం మైనారిటీలకు అన్యాయం చేసే సిఎఎ అమలు నిర్ణయాన్ని విరమించుకోవాలి. ప్రజాతంత్ర వాదులంతా బిజెపి ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలి.

- ఎస్ఎండి రఫీ, నంద్యాల.

లా వర్సిటీ శంకుస్థాపనలో భాగస్వాములు కావాలి : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 14న కర్నూలులో జగన్నాథ గట్టు సమీపంలో లాయూనివర్సిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో బార్ అసోసియేషన్ సభ్యులతో జెసి సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ఈ నెల 14న ముఖ్యమంత్రి జగన్నాథగట్టులో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి శంకుస్థాపనకు రానున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో ఉన్న ట్రిబ్యునల్స్, జ్యూడిషియల్ అధికారుల వివరాలను బార్ అసోసియేషన్ సభ్యులను జెసి అడిగి తెలుసుకొన్నారు. వారికి జిల్లా యంత్రాంగం నుంచి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒను ఆదేశించారు. శంకుస్థాపనకు వచ్చే న్యాయవాదులు తప్పనిసరిగా డ్రెప్ కోట్ పాటించాన్నారు. న్యాయ విద్యార్థులు వైట్ యూనిఫాంలో వచ్చేలా చూడాలని బార్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. లా నేస్తం లబ్ధిదారులు హాజరయ్యేందుకు వారి జాబితాను కూడా సేకరించాలని జాయింట్ కలెక్టర్ డిఆర్‌ఒకు సూచించారు. కర్నూలు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రాంతాల నుండి బార్ అసోసియేషన్ సభ్యులు హాజరు కావాలన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ మాట్లాడుతూ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే న్యాయవాదుల కోసం ఉ.8.గం.లకు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో బస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ మధుసూదన్ రావు, డిటిసి శ్రీధర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఆర్.ఆనందరావు, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణ నాయుడు, బార్ అసోసియేషన్ సెక్రెటరీ లక్ష్మణ్, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ హక్కుల రక్షణకు ఐక్య ఉద్యమం

- సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళా హక్కుల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు బుధవారపేటలో మెరీడియన్ ఫంక్షన్ హాలులో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా రక్షణ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం అనే అంశంపై ఐద్వా, శ్రామిక మహిళా సంఘం, యుటిఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఒ అనురాధ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, అంగన్వాడి టీచర్స్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి రేణుక, పుణ్యవతి టిఎల్ఎఫ్ అధ్యక్షులు కిరణ్మయి మాట్లాడారు. మహిళలు హింసకు వ్యతిరేకంగా పోరాడి వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం మార్చి8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళలకు సమానత్వం కావాలంటే అది ఇంటినుండే మార్పు మొదలు కావాలన్నారు. ఆడ,మగ పిల్లలను అన్ని విషయాల్లోనూ సమానంగా పెంచాలని పిలుపునిచ్చారు. నేడుమహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ వారి ప్రతిభను చాటుతున్నారన్నారు. మహిళలు గుడి, బడి, ఆఫీస్, బస్టాండ్, రైల్వే స్టేషన్ అన్నింటిలోనూ హింసకు, అత్యాచారాలకు బలవుతున్నారని తెలిపారు. ఎన్ని కఠినమైన చట్టాలు తెచ్చినప్పటికీ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని విమర్శించారు. చివరికి డబల్ ఇంజన్ సర్కార్ పేరుతో రోజు గొప్పలు చెప్పే బిజెపి ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, మణిపూర్‌లో మహిళల పైన పసిపిల్లల పైన అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. కొన్ని రకాల డ్రెస్సులు వేసుకోవడం వల్ల, ఆడవారు బయట తిరగడం వల్ల అత్యాచారాలు జరుగుతున్నాయని బిజెపి మంత్రులే మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చివరికి మత ఉన్మాద మూకల చేతిలో కుటుంబాన్ని పోగొట్టుకొని అత్యాచారానికి గురై ప్రాణాలు రక్షించుకొని కోర్టులో శిక్ష వేయించిన బిల్కిస్‌భాను నిందితులను సైంతం సత్య హరిచంద్రులంటూ విడుదల చేసిన దుర్మార్గమైన ఘనత బిజెపికే చెందుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందాయన్నారు. అందుకే రాబోయే ఎన్నికల్లో స్వేచ్ఛగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మహిళల రక్షణ కోసం నిరంతరం పనిచేసే మహిళలకు అండగా నిలిచే అభ్యర్థులకు మహిళలందరూ ఓట్లు వేసి గెలిపించినప్పుడే నిజమైన గౌరవం దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హసీనా, సావిత్రిబాయి పూలే వేషధారణలో సావిత్రిబాయి, ఫాతిమా షేక్ మహిళల అభివద్ధి కోసం మహిళలకు విద్య అందించడానికి చేసిన కషి అలాగే ఓటు గొప్పతనానికి సంబంధించిన పాటలు పాడి అందరిని ఎడ్యుకేట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అరుణ ,ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు బంగి పద్మ, రషీద ఐద్వా ట్రెజరర్ పిఎస్ సుజాత, ఐద్వా నాయకులు అనసూయ ,శేకున్, శ్యామల, కమరున్ , డివైఎఫ్ఐ నాయకులు శిరీష, పిఎన్ఎం కళాకారిణి నోమేశ్వరి , వేణి, శ్రామిక మహిళలు, అంగన్వాడి ఆశ వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14 న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తక్షణమే కార్మికుల రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ఢిల్లీలో జరుగుతున్న మహా ప్రదర్శనకు సంఘీభావంగా ఈనెల 14న కర్నూలు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా మంగళవారం కర్నూలులోని ఎఐటియుసి కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. కరపత్రం విడుదల చేసిన వారిలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి, ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, రేణుక, రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలు కార్మిక రంగానికి పూర్తిగా నష్టం చేస్తున్నాయన్నారు. గతంలో ఉన్న కార్మిక చట్టాలను కొనసాగించాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత చేయాలన్నారు. 2022 వ సంవత్సరం విద్యుత్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే విధానాన్ని మానుకోవాలని, రైతుల రుణ మాఫీ చేయాలని, 26000 కనీస వేతనం ఉండాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచనను మానుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కాపాడాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా కార్మికుల రైతుల ఉద్యమం కొనసాగుతున్నదన్నారు. ఢిల్లీ చుట్టుపక్కల లక్షలాది మంది రైతులతో ఉద్యమం జరుగుతున్నది. ఈ ఉద్యమానికి సంఘీభావంగా ఈనెల 14న రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలను కూడా కట్టుకొని అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చాయి. నరేంద్ర మోడీ రైతులు, కార్మికుల ఎడల రాక్షసుడు లాగా వ్యవహరిస్తున్నారు. పేద వర్గాలను పిండి చేసి పెట్టుబడిదారులకు పంచభక్ష పరమాన్నలను వడ్డించి పేద వర్గాలకు ఎంగిలి మెతుకులు విదిలిస్తున్నాడు. అంబానీ లాంటి బడా పెట్టుబడు దారులకు యావత్ దేశ సంపదను కట్టబెడుతున్నాడు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొని సంఘీభావం తెలియచేయాలన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు మేయర్‌గా సత్యనారాయణమ్మ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



కర్నూలు మేయర్‌గా సి.సత్య నారాయణమ్మను వైసిపి అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రస్తుత కర్నూలు నగర మేయర్ బివై.రామయ్యను వైసిపి కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించ నుండడంతో ఆ స్థానంలో సత్యనారాయణమ్మను ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. సత్యనా రాయణమ్మ 25 వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికయి ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు.



మహిళలకు చేయూత చెక్కును అందజేస్తున్న డాక్టర్ సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి

మహిళల చిరునవ్వులే జగనన్నకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కోడుమూరు : మహిళల ముఖాల్లో చిరునవ్వులే ముఖ్యమంత్రి జగనన్నకు ఆశీర్వాదమని కోడుమూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మహిళల సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. గూడురులో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గూడూరు నగర పంచాయతీలో 1516 మహిళలకు రూ. 2.84 లక్షలు, గూడూరు మండలం 1320 మహిళలు రూ.2.48 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ సిఎం అమలు చేశారన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు మహిళల రుణాలు మాఫీ చేస్తామని, నిరుపేదలకు ఇళ్ల నిర్మిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని 650 మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మహిళలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే సిఎం జగనన్న లక్ష్యమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ, 25 ఎంపి స్థానాలను వైసిపి కైవసం చేసుకుంటుందన్నారు. మహిళా లోకం ఒక్కటై వైసిపిని గెలిపించుకోవాలని కోరారు. గూడూరులో తాగు నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, ఎంపిడిఒ జయశ్రీ, ఎంపిపి సునీత రెడ్డి, జడ్‌పిటిసి మౌలాలి మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ 1 అస్లాంబాష, వైస్ చైర్మన్ 2 లక్ష్మన్న, కౌన్సిలర్లు కుమారు, నందకిషోర్, కర్నూలు జడ్‌పిటిసి ప్రసన్నకుమార్, గూడూరు నగర పంచాయతీ జెసిఎస్ కన్వీనర్ ఆబేలు, మండలం సమైక్య అధ్యక్షురాలు రజియా, మెప్మా ఎపిఎం సూర్యనారాయణ, ఎ పిఎం చక్రధర్, మహేశ్వర్ రెడ్డి, ఉల్చాల విష్ణువర్ధన్ రెడ్డి, దౌలత్, సత్యాలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

14న నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన

హాజరుకానున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి

250 ఎకరాల భూ కేటాయింపు

లా కోర్సుల అభ్యసనకు అవకాశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల కాలంలో లా కోర్సుల్లో విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. లాకోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలున్నాయి. దేశంలోనే అత్యున్నతనమైన న్యాయ విశ్వ విద్యాలయం కర్నూలులో నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. లా కోర్సులను అభ్యసించేందుకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఇక్కడే అవకాశం కలగనుంది. కర్నూల్ లో ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీ ద్వారా ప్రసూన లా కళాశాలలో లా డిగ్రీ కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంది. రాష్ట్రంలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని విశాఖపట్నంలో నెలకొల్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలో రెండవ న్యాయ విద్యాలయం ఏర్పాటుకు అంకురార్పనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో ఇప్పటికే నెలకొల్పిన ట్రిబుల్ ఐటిడిఎం , క్లస్టర్ వర్సిటీ విద్యాసంస్థల సమీపంలోనే రెండవ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దాదాపుగా 250 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి భూ కేటాయింపులు కూడా పూర్తి చేసింది. వాస్తవానికి గతేడాదే న్యాయ విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో న్యాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన పనులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈనెల 14న గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి న్యాయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేయనున్నారు.రాయలసీమ ప్రాంతంలోనే ఏర్పాటు చేయనున్న తొలి జాతీయ న్యాయవిశ్వవిద్యాలయంలో అనేక లా కోర్సులను అభ్యసించేందుకు ఈ ప్రాంత విద్యార్థులకు అవకాశం ఉంటుంది. లాసెట్ ఎంట్రన్స్ ద్వారా ఈ విశ్వవిద్యాలయంలో కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంటుంది. ఐదేళ్ల లా కోర్సులైన బిఏఎల్ఎల్.బి బీకాం ఎల్ఎల్‌బి, బిసిఏఎల్ఎల్ బి తోపాటు మూడేళ్ల డిగ్రీ ఎల్ఎల్‌బి కోర్సులు అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు ఎల్ఎల్ఎం కోర్స్ తో పాటు ఇతర కరస్పాండెంట్స్ లా కోర్సులు చేసేందుకు విద్యార్థులకు అవకాశం ఉంటుంది.

జాతీయ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలి

కెంగార కుమార్ , ఐలు రాష్ట్ర అధ్యక్షులు

కర్నూలులో ఏర్పాటు చేయనున్న రెండవ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడమే కాదు వెంటనే భవన నిర్మాణ పనులను ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరం నుండి కోర్సుల్లో ప్రవేశాలకు చర్యలు చేపట్టాలి. యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కూడా కేటాయించాలి.

నా కోర్సుల్లో అభ్యసనకు అవకాశం

బాలాజీ న్యాయ విద్యార్థి



కర్నూలులో ఇలాంటి జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం పట్ల స్వాగతిస్తున్నాం. ఇక్కడున్న విద్యార్థులు లా కోర్సులు చదివేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే విశ్వవిద్యాలయంలో చదివేందుకు అవకాశం ఉంటుంది. అనేక రకాల లా కోర్సులను అభ్యసించేందుకు కూడా విద్యార్థులకు అవకాశం ఉంది.

త్వరగా అడ్మిషన్లు నిర్వహించాలి

రమేష్ న్యాయ విద్యార్థి



జాతీయ రెండవ న్యాయ విశ్వవిద్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయడం అభినందనీయం. వెంటనే విశ్వ విద్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరగా అడ్మిషన్లను నిర్వహించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి

వైసిపి జిల్లా కార్యాలయంలో 14వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కర్నూలు నియోజకవర్గం వైసిపి కార్యాలయములో కర్నూలు నియోజకవర్గం వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఎఎండి.ఇంతియాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ఆయన కేకును కట్ చేశారు. వారితో తన సంతోషాన్ని పంచుకున్నారు.

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి, జొన్నగిరి, ఎర్రగుడి, పెండేకల్లు,శభాష్ పురం, రాతన తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో వైసిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తుగ్గలిలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి తనయుడు శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిట్టా నగేష్ యాదవ్, పూలు మాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేకులు కట్ చేశారు.



వైసిపి జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైసిపి అభ్యర్థి ఎంఎండి ఇంతియాజ్



మాట్లాడుతున్న గౌరు చరిత

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

రాయలసీమ గర్జనలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గతఎన్నికలకు ముందు నిరుద్యోగులకు, విద్యార్థులకు,యువజనలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరంకుశంగా పరిపాలిస్తున్న వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించుదామని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు దేవి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన 'ఉద్యోగం మన హక్కు అనే నినాదం తో రాయలసీమ గర్జన కార్యక్రమం నిర్వహించారు. భారీ ఎత్తున నిరుద్యోగులు, విద్యార్థులు హాజరై ఉద్యోగం మా హక్కు అంటూ నినదించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ యువతకు జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా నాలుగున్నరేళ్లలో సిఎం మోసం చేశాడన్నారు. వైసిపి ప్రభుతాన్ని గద్దె దింపుదామని, నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉండాలని గౌరు దంపతులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ , రాయలసీమ విద్యార్థి విభాగం జెఎసి చైర్మన్ శ్రీరాములు, విద్యార్థి విభాగం నాయకులు అయ్యస్వామి, నాగరాజు, కోనేటి వెంకటేశ్వర్లు, ఎద్దుపెంట అంజి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ పాల్గొన్నారు.

నేడు జి.వి మాల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

GV MALL shop & celebrate Women Men Kids

కర్నూలు నగరంలో వెంకటేష్ టాకీస్ ఎదురుగా పార్కు రోడ్డు నందు బుధవారం ఉదయం 10.30 గంటలకు నూతన అతిపెద్ద షాపింగ్ మాల్ జివి మాల్ కొత్త బ్రాంచ్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటి సంయుక్త మీనన్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. అలాగే ముఖ్య అతిథులుగా కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, తెలంగాణ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కర్నూలు మేయర్ బి వై.రామయ్య, కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, 12వ వార్డు కార్పొరేటర్ అన్ని పోగొ క్రాంతికుమార్ పాల్గొననున్నారు. ఇక్కడ అన్ని రకాల వస్త్రాలు ప్రజలకు అనువైన ధరలకు లభిస్తాయని, ప్రారంభోత్సవ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. కర్నూలు ప్రజలందరూ విచ్చేసి మాల్ ప్రారంభోత్సవాన్ని జయవంతం చేయాలని జివి మాల్ యాజమాన్యం డైరెక్టర్ గుర్రం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా రాఘవేంద్రుని పట్టాభిషేకం

- ఘనంగా శ్రీగురు వైభోత్సవాలు - ప్రముఖులకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదీతీరంలో వెలసిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల పాదుకలకు పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీగురు వైభవోత్సవాల్లో భాగంగా మంగళవారం ఊయల మండపంలో స్వర్ణ సింహాసనంపై పాదుకలను ఉంచి పండితుల వేద మంత్రాలతో, మంగళ వాయిద్యాల మధ్య బంగారు నాణేలు, ముత్యాలు, పుష్పార్చనతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. శ్రీమఠం ఆధ్వర్యంలో సంస్కృతం, కన్నడ తెలుగు బాషల్లో ముద్రించిన 2024 పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగం ప్రధాన కార్యాలయంలోనే కాక శ్రీమఠం ఆధీనంలో ఉన్న అన్ని బ్రాంచీల్లో ఉచితంగా పంపిణీ చేస్తారు. అనంతరం స్వామి వారి పాదుకలను స్వర్ణ రథోత్సవంపై ఉంచి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పుష్పాభిషేకంతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టరేట్ పండిత కేసరి మహామహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష జోష్యి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

శ్రీమఠంలో మూల రాములకు విశిష్ట పూజలు

శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. పూజా మందిరంలో మూల రాములు, జయరాములు, దిగ్విజయరాముల మూర్తులను స్వర్ణ పీఠంపై ఉంచి క్షీరాభిషేకంతో పాటు బంగారు నాణేలు, ముత్యాలతో, పుష్పార్చనతో అర్చించారు. బ్రహ్మ దేవుని చేత పూజింపబడిన మూల రాముల విగ్రహ మూర్తుల వైశిష్ట్యం గురించి వివరించారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రస్వామి మూల బృందావనం

నిత్యం వేద మంత్రాలతో, ఆధ్యాత్మిక శోభతో అలరారుతూ మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు తెల్లవారుజామునే రాఘవేంద్రస్వామి మూల బృవనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూలరాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకున్నారు.

బృందావనానికి నవరత్నాల, స్వర్ణ కవచాల విరాళం

శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి హైదరాబాద్‌కు చెందిన తిరుమల రెడ్డి అనే భక్తుడు నవరత్న స్వర్ణ కవచాలను విరాళంగా అందించినట్లు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. పీఠాధిపతులు తిరుమల రెడ్డి దంపతులకు శేష వస్త్రం అందజేశారు. పీఠాధిపతులు మాట్లాడుతూ... రూ.కోట్లు విలువ చేసే నవరత్న స్వర్ణ కవచాలను విరాళంగా ఇచ్చిన తిరుమల రెడ్డి కుటుంబానికి రాఘవేంద్రస్వామి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం

వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖలకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డులను ప్రదానం చేశారు. స్థానిక శ్రీమఠం ఆవరణలో ఉన్న యోగీంద్ర సభామండపంలో అవార్డులను అందజేశారు. కర్ణాటక రాష్ట్రంలోని హిందూ మతం, ధర్మాదాయ శాఖ కమిషనర్ హెచ్.బసవరాజేంద్ర, కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, కర్ణాటక ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ ఎన్.నాగరాజ్ అంకసదొడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపికి చెందిన ఫొటోగ్రాఫర్ ఆస్ట్రో మోహన్, ఆర్ఎన్.దేవరాయ సముద్రం సామాజిక కార్యకర్త రవికుమార్, బెంగళూరుకు చెందిన అడ్వా ఫణిరాజ్ కశ్యప్‌కు పీఠాధిపతులు అవార్డులను ప్రదానం చేశారు. గౌహతి హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ శ్రీధర్ రావు కూడా అవార్డును స్వీకరించిన వారిలో ఉన్నారు.



రాఘవేంద్రస్వామి అనుగ్రహ అవార్డును సతీ సమేతంగా అందుకున్న ఎస్పీ కృష్ణకాంత్

అభివృద్ధి జరగాలంటే వైసిపిని గెలిపించండి

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి - 47 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - గోనెగండ్ల


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎర్రకోట, బుట్టా రేణుక

అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగాలంటే ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను, ఆలూరు ఎమ్మెల్యేగా విరుపాక్షిని గెలిపించుకొని గెలిపించాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గంజిహళ్లి గ్రామంలో హంద్రీనదిపై గంజిహళ్లి, తెర్నేకల్ గ్రామాల మధ్య రూ.47 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు పనులకు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించేందుకు అణువుగా రహదారుల సౌకర్యాలను కల్పించినప్పుడే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ హైలైవెల్ బ్రిడ్జి ఏర్పాటు వల్ల ఎమ్మిగనూరు, గోనెగండ్ల, తెర్నేకల్, కరివేముల, పత్తికొండ వరకు గ్రామాల మధ్య దూరం తగ్గుతుందని చెప్పారు. వర్షాకాలంలో హంద్రీలో నీటి ప్రవాహం ఎంత ఉధృతంగా ఉన్నా సులువుగా రాకపోకలు సాగించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ శైలేష్ కుమార్ రెడ్డి, గాజులదిన్నె ప్రాజెక్టు డిఇ విజయ్ కుమార్, ఎఇఇలు చిన్న అలీ, నారాయణ, పరమేష్, ఎల్‌ఎల్‌సి డిఇ లక్ష్మణకుమార్, ఎఇ ఉదయ భాస్కర్, వైసిపి నాయకులు బుట్టా నీలకంఠ, బిఆర్.బసిరెడ్డి, తిరుమలరెడ్డి, బందే నవాజ్, దొరబాబు నాయుడు, తోలు రాముడు, భాస్కర్ రెడ్డి, మన్సూర్, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, ఉప సర్పంచి ఈరన్న, దేవనకొండ ఎంపిపి భర్త లుముంబ, క్లాస్-1 కాంట్రాక్టర్ అమరేశ్వరప్ప, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు'ను సద్వినియోగం చేసుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం



పారంభోత్సవంలో పాల్గొన్న మురళీ మోహన్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు' సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి ప్రయాణికులను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అదేశాల మేరకు మంత్రాలయం రోడ్డు (తుంగభద్ర) రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్లతో చేపట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, అలాగే రైళ్ల లైన్ల పొడిగింపు, డబ్లింగ్ పనులు వంటివి రైల్వే అధికారులు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని తెలిపారు. ఈ వందేభారత్ రైలు కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి, వాడి, రాయచూరు, మంత్రాలయం రోడ్డు (తుంగభద్ర), గుంతకల్లు, అనంతపురం, యలహాంక, బెంగళూరు స్టేషన్‌లో మాత్రమే స్టాపింగ్ ఉంటుందని చెప్పారు.

మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, ఆర్థిక సహాయాలతో మహిళలు అన్ని రంగాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రాజేశ్వరి కల్యాణ మండపంలో ఎపిఎం జనార్ధన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం కింద రూ.12.40 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లు నిండిన మహిళలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. 2014 నుంచి, 2019 వరకు బాబు పాలనకు 2019 నుంచి 2024 జగనన్న అందిస్తున్న సుపరిపాలనకు వ్యత్యాసం తెలుసుకుని మళ్లీ జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసిపి నాయకులు పంపాపతి, ఎంపిపి బడాయి దానమ్మ, శశి రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ వేలం ద్వారా పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

దినసరి మార్కెట్, వారపు సంత బహిరంగ వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం పెరిగిందని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో దినసరి మార్కెట్, వారపు సంతకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం పంచాయతీ 2024-25 సంవత్సరానికి బహిరంగ మార్కెట్ వేలాలు వేసినట్లు తెలిపారు. గతేడాది దినసరి మార్కెట్ రూ.81 వేలు ఉండగా, ఈఏడాది రూ.94 వేలు వచ్చిందని, వారపు సంత మార్కెట్ గతేడాది రూ.42 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.49 వేలు వచ్చిందని తెలిపారు. ఈ రెండింటినీ మాణిక్యం నరసయ్య దక్కించుకున్నారని చెప్పారు. విస్తరణాధికారి ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి బివి.నాగరాజు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి మద్దతు ఇవ్వాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని వామపక్ష ప్రజాసంఘా నాయకులు కోరారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు మాట్లాడారు. రైతులు చేపట్టిన చలో ఢిల్లీకి మద్దతుగా పట్టణంలో జరిగే రైతు, కార్మిక సంఘాల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, ఎఐటియుసి నాయకులు భీమేష్, ఎల్లప్ప, నరసప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కౌతాళం : మండలంలోని కుంభాలనూరు గ్రామానికి చెందిన మాల మూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకులు జి.రామస్వామి రూ.10 వేలను మృతుని భార్య భాగ్యలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడారు. మాల మూర్తి మృతి చెందడం తీరని లోటన్నారు. చిన్న వీరయ్య, మహదేవ, వీరేష్, హంపయ్య, చెన్న బసవ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న వైసిపి నాయకులు రామస్వామి

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

చిప్పగిరి : వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి తెలిపారు. మంగళవారం ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలానికి చెందిన కొంతమంది టిడిపి సీనియర్ నాయకులు విరుపాక్షి ఆధ్వర్యంలో చిప్పగిరిలోని ఆయన స్వగృహానికి వచ్చి వైసిపిలో చేరారు. చాకలి రామకృష్ణ, బింగి శివప్ప, యాగ్గడి చంద్ర, బింగి లింగప్ప, యాగ్గడి దేవేంద్ర, గూళ్యం బీరప్ప, బింగి హనుమంతు, చాకలి ఎర్రప్ప, పింజరి ఖాసీం, చాకలి రమేష్, ఎనుముల హనుమయ్య, తలారి ఈరన్న, రంగస్వామి, తలారి వన్నూరు స్వామి, ఎనుముల వన్నూరు, ఎత్తు గాది, మొండాలి గేరి అంజి, పోలీసు నర్సప్ప పాల్గొన్నారు.

కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి : శివన్న

ఆదోని : జిల్లాలో కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల సీట్ల కేటాయింపుల్లో కురువలకు స్థానం కల్పించకపోతే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, ఎంపీ స్థానం నుంచి కూడా పోటీలో ఉంటారని తెలిపారు. ఏ పార్టీ కేటాయిస్తుందో ఆ పార్టీకి కురువల పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని చెప్పారు. కర్నూలు ఎంపీ స్థానానికి వైసిపి నుంచి గడ్డం రామకృష్ణ, టిడిపి నుంచి పంచలింగాల నాగరాజు, బత్తిన లక్ష్మీనారాయణ, భాను శంకర్, పరమేష్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసిందని అన్నారు.

సోమప్ప మార్గంలో నడుద్దాం...

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక
- చేనేతల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలో చేనేతల జీవన ప్రమాణాలను పెంచడానికి పద్మశ్రీ మచాని సోమప్ప కృషి చేశారని, ఆయన మార్గంలో నడుద్దామని వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. మంగళవారం స్థానిక వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో ఎమ్మిగనూరు నియోజకవర్గ స్థాయి చేనేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సోమప్ప ఆశయాలు కొనసాగించాలని, బీసీ నినాదాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి జగన్ ఆలోచనను స్వాగతించాలని కోరారు. చేనేతలు చట్ట సభలకు వెళ్లాలని, అందుకే బీసీలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపితే చేనేతల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతూల్, కుర్ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు, షాప్ నెట్ ఎపి ఛైర్మన్ మాచాని వెంకటేశ్వర్లు, కుర్ని కార్పొరేషన్ ఛైర్మన్ బుట్టా శారదమ్మ, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, కామర్తి నాగేశప్ప, శివ ప్రసాద్, గడిగె లింగప్ప, బండారు ఆనంద్ ప్రసాద్, డాక్టర్ శిల్పా, నీలకంఠ, స్వాతి, వినయ్, శివదాసు, విశ్వనాథ్ రమేష్ పాల్గొన్నారు.


సమ్మేళనంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

చేనేతల ఆస్తులను కాజేసేందుకేనా..?

- కురువ సాధికారిక కమిటీ కర్నూలు పార్లమెంట్ సభ్యులు కెటి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

చేనేతలను ఆత్మీయ సమ్మేళనంతో చేనేతలకు కేటాయించిన ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని కురువ సాధికారిక కర్నూలు పార్లమెంట్ సభ్యులు కెటి.వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. నవోదయ స్కూల్ ఎదురుగా టెక్స్‌టైల్ పార్కు కోసం కేటాయించిన స్థలంలో ఒక్కో ఇంటి పట్టాకు వైసిపి నాయకులు రూ.50 వేలు దండుకున్నారని తెలిపారు. వారి కబంధహస్తాల నుంచి ఆ స్థలాన్ని కాపాడాలని హితవు పలికారు. నియోజకవర్గ చేనేతల కోసం 2014 తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో నాటి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బనవాసి ఫారం ఫారెస్ట్ భూముల అనుమతులు తీసుకొని 150 ఎకరాలు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఉన్నత స్థితిలో చూడాలని బీవీ భావించారని చెప్పారు. వైసిపి నాయకులు ఆ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ చేనేతలను నిలువునా ముంచారని విమర్శించారు. నేడు 'చేనేత ఆత్మీయ సమ్మేళనం' అంటూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. స్థానికంగా ఉండే చేనేత నాయకులు మాచాని వెంకటేష్‌ను కాదని.. హైదరాబాద్ వలస వెళ్లిన రేణుకను వైసిపి ఇన్‌ఛార్జీగా నియమించడం వల్ల 'నన్ను మించిన చేనేత నాయకులు ఇక్కడ ఎవరూ లేర'ని భావించడం చేనేత నాయకులను అవమానపరచడమేనని తెలిపారు. చేనేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే అర్హత బుట్ట రేణుకకు ఉందా అని ప్రశ్నించారు. 2014లో వైసిపి తరఫున కర్నూలు ఎంపీగా గెలుపొందారని, రాష్ట్రంలో 2014 టిడిపి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధికారం లేకుండా ఆరు నెలలు కూడా ఉండలేని బుట్టా రేణుక టిడిపిలోకి వెళ్లారని చెప్పారు. తర్వాత 2019లో వైసిపి అధికారంలోకి రాగానే వైసిపిలోకి జంప్ అయ్యారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలకు రెండు నెలల ముందు ఆమెను వైసిపి ఇన్‌ఛార్జీగా నియమించారని అన్నారు. నియమించిన మరుక్షణమే హైదరాబాదులో నివాసం ఉండే రేణుక తట్ట బుట్టా సర్దుకుని ఎమ్మిగనూరులో అద్దె ఇల్లు, ఆఫీసు తీసుకున్నారని తెలిపారు. వైసిపి నాయకులు చేనేతల సొంత ఆస్తి వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్‌ను మున్సిపాలిటీకి ధారాదత్తం చేస్తుంటే, అధికారమే పరమావిధిగా భావించి అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆలింగనం చేసుకుంటున్న రేణుకకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే అర్హత ఉందా అని ప్రశ్నించారు.



ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళశారం శిల్పా ఎస్టేట్‌లోని వైసిపి కార్యాలయం దగ్గర వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుట్టా రేణుక, ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, బుట్టా శివ నీలకంఠ, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు, టౌన్ బ్యాంకు ఛైర్మన్ కొమ్ము రాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, అధికార ప్రతినిధి కదిరి కోట సునీల్ కుమార్ పాల్గొన్నారు. **ఆలూరు** బస్టాండ్ ఆవరణలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి వైసిపి జెండాను ఆవిష్కరించి, బస్టాండ్, కోట వీధిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. జడ్‌పిటిసి ఎరూరు శేఖర్, ఎంపిపి రంగమ్మ, చిప్పగిరి మారయ్య, మండల కన్వీనర్ ఈరన్న, కో కన్వీనర్ వీరేష్, రామాంజినేయులు, పెట్రోల్ బంక్ కిషోర్, శ్రీధర్ పాల్గొన్నారు. **ఆదోని**లో వైసిపి జెండాను ఆవిష్కరించి పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి పట్టణ అధ్యక్షులు బోయ దేవా, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి మాట్లాడారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల ఆశీస్సులతో 2024లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి మళ్లీ ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్టేట్ డైరెక్టర్ రేణుక, సుగుణ, చలపతి, చిన్న, ఈరన్న, కామాక్షి తిమ్మప్ప, తాయన్న, రామదాసు, రంగస్వామి, వీరప్ప, తాయన్న, బాబు, బిటి.లక్ష్మన్న, రాఘవేంద్ర, దుర్గప్ప, మునీర్, ఫయాజ్, హరికృష్ణ, దేవదాస్, అశోక్, సూరి, అఖిల్, బాష, భద్ర, గంగాధర్, ఆది, బాష, గుండా కామప్ప, చలపతి, చిన్న గౌడ్, హనుమంతు, అంజి, సింహం నాగేంద్ర, బాలు, దేవేంద్ర పాల్గొన్నారు. **దేవనకొండ** గ్రామంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి సోదరులు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, జెసిఎస్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, వైసిపి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, నిజాలురెడ్డి, దివాకర్ నాయుడు, ప్రేమ నాథ్ రెడ్డి, ఎల్‌కె.శ్రీనివాసులు, రామచంద్ర, చంద్రన్న, ఉరుకుందు, యూసుఫ్ బాష, వీరభద్ర, రంగస్వామి, జనార్ధన్ నాయుడు, చిన్నారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఆలూరులో జెండాను ఎగురవేస్తున్న విరుపాక్షి

ప్రజల వద్దకే పాలన దేశానికే ఆదర్శం

- టిటిడి పాలక మండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైసిపి తీసుకొచ్చిన ప్రజల వద్దకే పాలన దేశానికే ఆదర్శమని టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి, వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దొడ్డిమేకల, కల్లుకుంట, కంబాలదిన్నె, నాగలాపురం, బసలదొడ్డి, తారాపురం, చిన్నకడబూరు గ్రామాల్లో సర్పంచులు చంద్రశేఖర్, ఇస్మాయిల్, తిమ్మక్క, చంద్రిక, బుడ్డ అంజినమ్మ, అనసూయమ్మ, లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సీతారామిరెడ్డి, ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, ఎంపిపి శ్రీవిద్య, జడ్‌పిటిసి రాజేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. దొడ్డిమేకలలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, కల్లుకుంటలో జలజీవన్ మిషన్ కింద రూ.116.48 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్, రూ.8 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీ, సిసి రోడ్డును, కంబాలదిన్నెలో రూ.20.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె, రూ.20.90 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్‌ను, నాగలాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె భవనం, రూ.26.50 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్‌ను, బసలదొడ్డిలో రూ.42.91 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్‌ను, తారాపురంలో రూ.50.38 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్‌ను, చిన్నకడబూరులో రూ.30.64 లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సంక్షేమ పథకాలు పేదలకు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, మంత్రాలయం ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ ప్రభాకర్, ఎఒ వరప్రసాద్, ఎఇలు మల్లయ్య, సాయి కుమార్, సచివాలయ జెసిఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, పెద్దకడబూరు సర్పంచి రామాంజనేయులు, మాజీ ఎంపిపి రఘురామ్, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, నాయకులు పూజారి ఈరన్న, గజేంద్రరెడ్డి, భీమ్ సేనరావు, కౌశిక్, శివరామిరెడ్డి, అర్లప్ప, ముక్కరన్న, నరసప్ప, అళ్లయ్య, మారెన్న, గోవిందు, హనుమంతురెడ్డి, శివరాం, లంకారెడ్డి, అంపయ్య, జాము మూకయ్య, నారాయణ, నాగరాజు, రామిరెడ్డి, కాంట్రాక్టర్ చేకూరి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీతారామిరెడ్డి

ఘనంగా బంగారమ్మ, మారమ్మవ్వ దేవర


పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో వెలసిన గ్రామ దేవతలు శ్రీమాత బంగారమ్మ, శ్రీమాత మారెమ్మమ్మ దేవర ఘనంగా జరిగింది. దేవర సందర్భంగా అమ్మవార్లకు మంగళ, గురువారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుస్మాండ బలి చేశారు. బుధవారం గ్రామంలో కుంభాలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దేవర సందర్భంగా భజన, సాంస్కృతిక కార్యక్రమాలను దేవాలయం పరిధిలో ఏర్పాటు చేశారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

దర్శించుకున్న నాయకులు

శ్రీబంగారమ్మ, శ్రీమారెమ్మ అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు గౌడ్, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తనయుడు బుట్టా ప్రతూల్, బుట్టా నాగరాజు, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, ముగతి సర్పంచి విరుపాక్షి రెడ్డి, పొంపయ్య దర్శించుకున్నారు.

ప్రజల భద్రత, భరోసాకు ఫ్లాగ్ మార్చ్

- ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- సిఐ వెంకటేశులు, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించినట్లు ఆలూరు సిఐ వెంకటేశులు, చిప్పగిరి ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ప్రజలకు భరోసా కల్పించేందుకు, సమస్యాత్మక గ్రామాల్లో అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలు కాపాడడానికి కవాతు నిర్వహించినట్లు తెలిపారు. చిప్పగిరి, కుందనగుర్తి, బెల్డోన, ఏరూరు, డేగలపాడు, గుమ్మనూరు గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసు యంత్రాంగం నుంచి ఎల్లవేళలా సహకారం ఉంటుందన్నారు. చిప్పగిరి పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోనిలో పోలీసుల కవాతు

ఆదోని : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్ ఎస్-ఎస్‌బి పోలీసులు భీమా సర్కిల్, చందసా దర్గా, మండిగిరి, ఇందిరానగర్, రాజీవ్ గాంధీ నగర్, ఆర్‌టిసి కాలనీ, ఎస్‌కెడి కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశమని డీఎస్పీ తెలిపారు. టూ టౌన్ సిఐ గోపీనాథ్ ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలం సంతేకుడ్లూరు, పెద్దహరివాణం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో సెంట్రల్ ఫోర్స్ ఎస్ఎస్‌బి, ఆదోని రూరల్ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవాతు సాగింది. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, ఆదోని రూరల్ తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి, ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఆదోనిరూరల్ : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మున్సిపల్ కార్మికులకు పెంచిన జీతాలివ్వాలి

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం పెంచిన జీతాలను ఇవ్వాలని, (సిఎల్) సెలవులను యథావిధిగా కొనసాగించాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి నాయకులు రంగన్న, తిమ్మగురుడు, సిఐటియు నాయకులు గోవిందు, రాముడు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

వడదెబ్బతో వలస కూలీ మృతి


ప్రజాశక్తి - కౌతాళం

బతుకుదెరువు కోసం వలస వెళ్లి వడదెబ్బకు గురై వలస కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు...కౌతాళం గ్రామానికి చెందిన కంబాలదిన్నె హుస్సేన్ సాబ్ (54) గుంటూరులో మృతి చెందాడు. గత 40 రోజుల క్రితం వలస కూలీలతో పాటు కంబాలదిన్నె హుస్సేన్ సాబ్ కుటుంబం గుంటూరు వలస వెళ్లింది. మృతదేహాన్ని గుంటూరు నుంచి కౌతాళానికి కొంతమంది సహాయంతో తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈయనకు భార్యతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి ఉహుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ హెచ్‌జి.వెంకటేష్ మాట్లాడుతూ... భక్తులు స్వామివారికి రూ.1,12,13,277 నగదును హుండీలో సమర్పించుకున్నారని తెలిపారు. పాలకమండలి సభ్యులు, హుండీ పర్యవేక్షణ అధికారి పిసి.రాంప్రసాద్, దేవస్థాన పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.





సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్, జేసి తదితరులు

ఎన్నికల్లో లబ్ధి కోసమే..

- సిఎఎపై పలువురి ఆగ్రహం - వ్యక్తమవుతున్న వ్యతిరేకత



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల్లో లబ్ధి కోసమే పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (సిఎఎ)ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఎఎపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది...

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) మళ్లీ తెరపైకి తెచ్చింది. చట్టం అమలుకు నిబంధనలను కేంద్రం హోం మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫై చేసింది. కేరళతో సహా అయిదు రాష్ట్రాలు ఈ పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడానికి ముందే కేంద్రం సవరించిన సిఎఎ నిబంధనలను నోటిఫై చేయడంలో ఆంతర్యం తెలియనిదేమీ కాదు. ఫాసిస్టు హిందూత్వను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితోనే అది ఈ పని చేసింది. ముస్లింల పట్ల వివక్ష చూపే ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని 2019 డిసెంబరు 11న పార్లమెంటులో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య అత్యంత అప్రజాస్వామికమైన రీతిలో ఆమోదింపజేసుకుంది. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబరు 31 లేదా అంతకు ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి భారత దేశానికి వలసవచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వాన్ని మంజూరు చేస్తుంది. ముస్లింలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఎఎపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

సిఎఎ రాజ్యాంగ విరుద్ధం



కేంద్రంలోని నరేంద్ర మోడీ భారత రాజ్యాంగానికి విరుద్ధంగా సిఎఎను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మైనార్టీల్లో ముస్లింలను మాత్రం పక్కన పెట్టి మిగతా వారందరికీ పౌరసత్వాన్ని ఇవ్వటం అంటే మతపరంగా హిందూ, ముస్లింలను చీల్చి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. భారత దేశంలో ఎక్కువ శాతం నిరుపేదలు చదువురాని వారు ఎక్కువగా ఉన్నారు. ఆధార్‌లోని తప్పులు సరిచేసుకోవాలంటేనే నానా తంటాలు పడాల్సి వస్తుంది. పొట్టకూటి కోసం కష్టపడే వారు పూర్వీకుల నుండి వారసత్వము తీసుకురావాలంటే ఎలా తీసుకురాగలరు. ప్రభుత్వం పునరాలోచించి మైనార్టీల అందరిని సమానంగా చూసి న్యాయం చేయాలి. సిఎఎను వెంటనే రద్దు చేయాలి.

- మహమ్మద్ పీర్, మైనార్టీ నాయకుడు, కర్నూలు.

కేవలం ఓట్ల కోసమే సిఎఎ



దేశంలో ఉన్న ప్రజా సమస్యలపై ప్రజల వ్యతిరేకత నుండి దృష్టి మరల్చేందుకే పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో ఏదో ఒక సమస్య సృష్టించి పబ్బం గడుపుకోవడమే బిజెపి లక్ష్యం. దేశంలో నివసించే పౌరుల డేటా అంతా ఇంతకుముందే ఉంటుంది. ఈ రోజు కొత్తగా తమ నివాసాలను ధ్రువీకరించుకోవడం ఏం అవసరం ఉంది. ప్రశాంతంగా ఉన్న దేశంలో సిఎఎ అని మళ్లీ కొత్త రాగం, దానికి ప్రతిపక్షాలు వంత పాడటం ఎంత వరకు సబబు. సిఎఎను మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము.

-షేక్ బాబూలాల్, వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

సిఎఎ అమలు దుర్మార్గం



సిఎఎ అమలు దుర్మార్గం. లౌకిక సమాజాన్ని విభజించి, రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి చేస్తున్న కుట్ర. లోక్‌సభ ఎన్నికల తరుణంలో బిజెపి తన మతోన్మాద రూపాన్ని మరోమారు బహిర్గతపరుస్తోంది. మోడీ సర్కార్ ముస్లిం మైనారిటీలను అణచివేసే కుట్రతో సిఎఎ అమలుకు ఆఘమేఘాల మీద ప్రయత్నించడం దుర్మార్గం. మతపరమైన అంశాలతో ముడిపడి ఉన్న సిఎఎ చట్టాన్ని ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు, అనేక రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికలకు ముందు మతపరమైన, సున్నితమైన అంశమైన పౌరసత్వ సవరణ చట్టం అమలుకోసం బిజెపి చేస్తున్న కుయుక్తులపై రాష్ట్రంలోని టిడిపి, వైసిపి స్పందించి, తమ పార్టీల వైఖరిని స్పష్టం చేయాలి. ముస్లిం మైనారిటీలకు అన్యాయం చేసే సిఎఎ అమలు నిర్ణయాన్ని విరమించుకోవాలి. ప్రజాతంత్ర వాదులంతా బిజెపి ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలి.

- ఎస్‌ఎండి రఫీ, నంద్యాల.

ప్రజల దృష్టి మళ్లించడానికే



బిజెపి ప్రతి ఎన్నికలకు ముందు సమస్యల వైపు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఒక సెన్సేషనల్ సమస్యను ముందుకు తీసుకొస్తుంది. అలా ఈ సారి సిఎఎను ముందుకు తీసుకొచ్చింది. సరిహద్దు దేశాల నుంచి వలస వస్తున్న వారి నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నామని బయటికి చెబుతోంది. నిజానికి హిందూ ఓటర్లందరూ ఒక వైపునకు వచ్చేలా పోలరైజేషన్ చేస్తున్నారు. ముస్లింలను అణగదొక్కుతామని బహిరంగ సందేశం ఇస్తున్నారు. హిందూత్వ శక్తుల్లో ఉత్సాహాన్ని నింపి ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారు. సిఎఎ వల్ల ముస్లింములు ఇక్కడే పుట్టామని పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. ఇది సాధ్యం అవుతుందా? దానికి సంబంధించి ఎలాంటి ధృవపత్రాలు ఉండవు. జైళ్లలోని వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ముస్లిములను సతాయించడం సులభం అవుతుంది. ఎన్నికల బాండ్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కూడా సిఎఎను బిజెపి ఒక ఆయుధంగా ప్రయోగిస్తోంది.

- ఆచార్య మన్సూర్ రెహమాన్, ఆర్థికవేత్త.

ప్రశాంతంగా ఉన్న దేశంలో చిచ్చు



ప్రశాంతంగా ఉన్న దేశంలో సిఎఎ మళ్లీ తెరపైకి తీసుకొచ్చి బిజెపి చిచ్చు పెడుతుంది. దేశంలో నివసించే ప్రతి పౌరుని యొక్క పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలు అన్ని ప్రభుత్వాల వద్ద ఉన్నాయి. మళ్లీ పౌరసత్వం నిరూపించుకోవాల్సిన అవసరం ఏముంది? బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా లౌకిక శక్తులు అందరూ కృషి చేయాలి. దేశవ్యాప్తంగా మైనార్టీల పైన జరుగుతున్న దాడులకు తోడు మైనార్టీల పట్ల వివక్షత చూపే విధంగా ఈ చట్టం ఉంది. రాష్ట్రంలో కూడా మైనార్టీల కోసం మా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని చెప్పాలి.

- మౌలాన అబ్దుల్ మజీద్, డబ్ల్యూహెచ్ఆర్‌సి నేషనల్ కన్వీనర్.

వ్యతిరేకత నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిఎఎ

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశంలో ఉన్న నెలకొన్న సమస్యలపై వస్తున్న వ్యతిరేకత నుండి ప్రజల దృష్టి మరలించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. భారత రాజ్యాంగంలో ఇతర దేశాల నుంచి ఎవరొచ్చినా వారి అంగీకారం మేరకు భారతదేశంలో పౌరసత్వం ఇవ్వాలని ఉందని, కేవలం ముస్లిముల పట్ల వ్యతిరేకతతో ఇతర దేశాల నుండి వచ్చే ముస్లింమేతరులకు పౌరసత్వం ఇస్తామని, ముస్లింలకు, తమిళులకు ఇవ్వబోమంటూ ఈ పౌరసత్వ చట్టాన్ని చేయడం ఒక మత భావాలు కలిగిన ప్రజలను ఈ దేశం నుండి దూరం చేయడమేనని తెలిపారు. భవిష్యత్తులో బిజెపికి మళ్లీ అధికారాన్ని కట్టబెడితే రాజ్యాంగంలో ఉన్న లౌకికతత్వం, సోషలిజం లాంటి పదాలు తీసేసి మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా లౌకిక శక్తులు అందరూ కృషి చేయాలని కోరారు. ఇప్పటికే దేశంలో ఉన్న ఐదు రాష్ట్రాలు పైగా ఈ చట్టాన్ని అమలు చేసేది లేదని ఖరాఖండిగా చెప్పాయన్నారు. దేశవ్యాప్తంగా మైనార్టీల పైన జరుగుతున్న దాడులకు తోడు మైనార్టీల పట్ల వివక్ష చూపే విధంగా ఈ చట్టం ఉందన్నారు. ఎపిలో మైనార్టీల కోసం ప్రభుత్వం పని చేస్తుందని చెప్పుకునే వైసిపి పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని చెప్పాలని, ఇటీవలే బిజెపితో పొత్తు కుదుర్చుకున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు ఈ చట్టం పట్ల ఆయన వైఖరి తెలియజేయాలని కోరారు. లౌకిక భావాలు, అనేక కులాలు, మతాలు ఉన్న ఈ దేశంలో మైనార్టీల పట్ల వ్యతిరేకత చూపిస్తున్న బిజెపి ప్రభుత్వం నిరంకుశ పోకడలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

14న ముఖ్యమంత్రి పర్యటన

- విజయవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 14వ తేదీ బనగానపల్లెలో పర్యటించనున్నారని, పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సిఎం పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులకు అప్పగించిన పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి సభా వేదిక వరకు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టడంతో పాటు దారికి అడ్డంగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని డిపిఒ, బేతంచర్ల మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశంలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, దుమ్ము లేయకుండా వాటరింగ్ చేయాలని ఆర్అండ్‌బి, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సభా ప్రాంగణం వద్ద మూడు జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీఎస్పిడిసిఎల్ అధి కారులకు సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రవీణ్ కుమార్, డిఆర్ఒ పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర రెడ్డి, మిరియాల దాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఆర్టీవో శివారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల అవగాహన లోపం.. రైతుల పాలిట శాపం..

- కెసి, తెలుగు గంగలో నీళ్లు ప్రవహిస్తున్నా పంటలు వేసుకోలేని పరిస్థితి

- పొలాలు బీడుగా పెట్టి నష్టపోతున్న వైనం



కెసి కెనాల్‌లో రెండు అడుగుల మేర ప్రవహిస్తున్న నీరు




బీడుగా మారిన పొలం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధుల అవగాహన లోపం రైతన్నల పాలిట శాపంగా మారింది. ఇరిగేషన్ కింద కళ్ల ముందు కెసి కెనాల్‌లో, తెలుగు గంగ కాలువల్లో నీరు పోతున్నా రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.. కెసిలో, తెలుగు గంగలో ఎగువ నుండి నీళ్లు వస్తున్నప్పటికీ అధికారుల దుందుడుకు విధానాల వలన, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు ఇవ్వాలనే సాకుతో పూర్తి స్థాయిలో సాగు నీరును ఇవ్వలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, కెసి కెనాల్ అధికారుల అవగాహన లోపంతో పంటలు సాగు చేసుకోలేక కొన్ని కోట్ల రూపాయలు కెసి ఆయకట్టు రైతులు నష్టపోయారు. 2023-24 సంవత్సరంలో రబీ పంటలు వేయకూడదని, వర్షాభావ పరిస్థితి ఉన్నందున ప్రాజెక్టులలో నీళ్లు తక్కువగా ఉన్నాయని, సెప్టెంబర్ 16 వరకు మాత్రమే నీళ్లు ఇస్తామని అధికారులు వెల్లడించారు. పంటలు వేస్తే రైతులు నష్టపోతారని ఎమ్మెల్యేలు, కెసి కెనాల్ అధికారులు నీటి సలహా మండలి సమావేశంలో మూకుమ్మడిగా ప్రకటించారు. రైతులు వారి ఆదేశానుసారం పంటలు వేయలేదు. కానీ ఇప్పటి వరకూ కెసి కెనాల్‌లో విడతల వారిగా నీళ్లు పారుతున్నాయి. కెసి ఆయకట్టు పొలాలను బీడుగా ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొలాల్లో వృధాగా నీళ్లు పోతున్నా ఏమీ చేయలేని పరిస్థితిలో రైతన్న ఉండి పోయాడు. రబీలో నీళ్లు విడుదల చేస్తామని చెప్పినట్లయితే కనీసం కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటలు వేసుకునే వారమని చెబుతున్నారు. పంటలు సాగు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి కావడానికి అవకాశం ఉన్నా ఎమ్మెల్యేలు, కెసి కెనాల్ అధికారుల అవగాహన లోపంతో రైతులు దాదాపు 1 లక్షా నుండి 2 లక్షల వరకు ఆదాయం కోల్పోయారు. ఈ పరిస్థితి ఈ సంవత్సరమే కాదని ప్రతి సంవత్సరం ఇలాగే ఉంటుందని కెసి కెనాల్ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అనాలోచిత నిర్ణయాలతో రైతులకు తీవ్ర నష్టం



ఇరిగేషన్ అధికారుల అనాలోచిత నిర్ణయాల వలన ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఏటా ఐఎబి సమా వేశాల్లో కొంత వరకు మాత్రమే నీళ్లు ఇస్తామని చెప్పడం, తీరా నీళ్లు వృధాగా పోవడం సర్వసాధారణమై పోతుంది. ఇప్పటికైనా స్పష్టమైన అవగాహనతో సాగు నీటిపై రైతులకు హామీ ఇవ్వాలి.

ఏ.రాజశేఖర్, ఎపి రైతుసంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి.



వీల్ చైర్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

డ్రైవర్ సుబ్రమణ్యంకు వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణానికి చెందిన డ్రైవర్ సుబ్రమణ్యానికి మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఉచితంగా వీల్ చైర్‌ను మంగళవారం అందజేశారు. ధరూర్ సుబ్రమణ్యం డ్రైవర్‌గా పని చేస్తూ మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బిసి రాజా రెడ్డి మూడురోజుల క్రితం సుబ్రమణ్యం ఇంటికి వెళ్లి పరామర్శించారు. సుబ్రమణ్యం నడవలేని పరిస్థితిలో ఉన్నందున ఎక్కడికైనా తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, వీల్ చైర్ ఇప్పిస్తే తమకు చేదోడుగా ఉంటుందని కుటుంబ సభ్యులు బిసి రాజారెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ఆయన వీల్ చైర్ తెప్పించి సుబ్రమణ్యంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో సుబ్రమణ్యం కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బిసి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

పిల్లలకు సాంప్రదాయాలు తెలియజేయాలి

ప్రజాశక్తి - పాణ్యం

భారతీయ సాంప్రదాయాల పట్ల భావితరాల పిల్లలకు అవగాహన కల్పించాలని గాయత్రి పాఠశాల డైరెక్టర్ సురేష్ బాబు అన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మి గాయత్రి పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ చక్కని విద్యకు, ఉత్తమ ఫలితాలకు వేదికగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు రకరకాల సంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



జ్యోతి వెలిగిస్తున్న పాఠశాల డైరెక్టర్ సురేష్ బాబు

గుండెపోటుతో పోస్టల్ ఉద్యోగి మృతి

- నివాళులర్పించిన వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పింజరిపేటకు చెందిన పోస్టల్ ఉద్యోగి



నివాళులర్పిస్తున్న వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి

సంటన్న (59)గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. ఉదయం సంటెన్నకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంటెన్న కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో భానుముక్కల సహకార పరపతి సంఘం చైర్మన్ శ్రీనివాసులు, వైసిపి యువజన విభాగం జిల్లాఉపాధ్యక్షుడు అంబటి రవికుమార్ రెడ్డి, పక్కిరా, కోనేటి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగి మృతికి బీసీ ఇందిరా నివాళి

పట్టణంలోని కొండపేటలో పింజరి పేటకు చెందిన పోస్టల్ ఉద్యోగి దూదేకుల సంటెన్న(59) మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరా

టిడిపిలోకి భూమాకిషోర్ రెడ్డి అనుచరులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఇటీవల భూమా కిషోర్ రెడ్డి బిజెపిని వీడి వైసిపిలో చేరడంతో ఆయన వెంట ఉన్న నాయకులు అసంతృప్తి చెంది మాజీ మంత్రి, టిడిపి ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిల ప్రియ ఆధ్వర్యంలో టిడిపిలో మంగళవారం చేరారు. చాగలమర్రి మండలంలోని కొలములపేట గ్రామంకు చెందిన హరిచంద్ర రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బరామిరెడ్డి, చంద్ర ఓబుల రెడ్డి, సహదేవరెడ్డి, ప్రతాపరెడ్డి, సుబ్బారెడ్డి తో పాటు మరో 30 కుటుంబాలు, డి.కొత్తపల్లి గ్రామంకు చెందిన విక్రమ్ ,నరసింహరెడ్డి, రమణ రెడ్డి, నాగేశ్వరావు, లక్ష్మయ్య, జయరాం రెడ్డి, హరినాథ్ రెడ్డి, రఘునాథరెడ్డి, ఈశ్వర్ రెడ్డితోపాటు మరో 20 కుటుంబాలు టిడిపిలో చేరారు. పెద్ద వంగలి ఓబయ్యతో పాటు మరో 45 కుటుంబాలు, మల్లవేముల టిఎన్ఎల్ పుల్లయ్యతో పాటు 20 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వీరికి భూమా అఖిలప్రియ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్, చాగలమర్రి మాజీ ప్రెసిడెంట్ అన్సర్ భాష, టిడిపి మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పి.నాగిరెడ్డి పల్లె గ్రామంలో అఖిలప్రియకు, సిపి శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం : మండలంలోని పి.నాగిరెడ్డి పల్లె గ్రామంలో టిడిపి అభ్యర్థి అఖిలప్రియ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకోగానే అఖిలప్రియకు, కేంద్ర కాటన్ బోర్డు మాజీ సభ్యులు, తాలూకా టిడిపి నాయకులు సిపి శ్రీనివాసరెడ్డి అలియాస్ వాసుకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మనోహర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి 20 కుటుంబాలు చేరిక : రుద్రవరం మండలం టి.లింగందిన్నెకు చెందిన మాజీ సొసైటీ చైర్మన్ గొడుగు నారాయణ , గొడుగు హరి, గొడుగు ఓబులపతి , వెంకటేశ్వర్లు, ముత్తగాళ్ల నారాయణ , కాసిపోయిన లింగయ్య, కాసిపోయిన చెవిటి బాలయ్య, కాసిపోయిన శివ నాగేంద్ర, వీరి అనుచరులు 20 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలోకి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో చేరారు.



నాగిరెడ్డి పల్లె గ్రామంలో గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

ఘనంగా వైసిపి ఆవిర్భావ వార్షికోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, పట్టణ ప్రముఖులు దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలని కోరారు. మరోసారి నంద్యాల ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించి జగన్మోహన్ రెడ్డికి కానుకగా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, సిఎంఎస్‌సి డైరెక్టర్ కలాం భాష, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, ఫామ్ షావలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అడ్డగళ్ల మల్లికార్జున, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ టివి రమణ, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు **మిగతా 6వ పేజీలో...**



వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎంపీ పోచ బ్రహ్మనందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, ప్రముఖులు

పెరుగుతున్న ఎండలు..

- నంద్యాలలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

- ప్రధాన కూడళ్లలో కనిపించని చలువ పందిళ్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో ఎండల తీవ్రత పెరుగుతుంది.. ఈ సంవత్సరం ముందుగానే ఎండలు అధికమయ్యాయి. సాధారణంగా ఎండలు మార్చి మధ్యలో కొంతవరకు పెరుగుతాయి. ఈ ఏడాది మాత్రం ఫిబ్రవరి నెలలోనే 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం పట్ల ప్రజల్లో భయాందోళన మొదలైంది. ఏప్రిల్, మే నెలలో 50 నుండి 55 వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయం ప్రజల నుండి వ్యక్తమవుతోంది. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలో దాదాపు 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వారం చివరిలోగా అత్యధికంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో, సిగ్నల్స్ వద్ద చలువ పందిళ్లు వేయడం ద్వారా వాహనదారులకు కొంతవరకు ఉపశమనం కలిగే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. సిగ్నల్స్ పడ్డప్పుడు వాహనదారులు అక్కడ కనీసం 3 నిమిషాల వరకు వేచి ఉండాల్సి ఉంటుంది. దీంతో నేరుగా ప్రజలపై సూర్య కిరణాలు పడటంతో వడ దెబ్బకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలు ఎక్కువ శాతం ఉదయం 11 గంటలలోపే బయటి పనులు పూర్తి చేసుకోవాలని, అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని, మళ్ళీ సాయంత్రం 4 గంటల తరువాత బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం : ఇఒ

ప్రజాశక్తి - మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది దేవస్థాన కార్యాలయంలో విలేకరులతో ఈవో మాట్లాడారు. ఆలయ సమీపంలో కొత్తగా భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినందుకు ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు. దర్శనం సేవ టికెట్లు, ప్రసాదాల ద్వారా మొత్తం రూ. 58 లక్షలు దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు లేకుండా మహానంది మండలం పంచాయతీ శాఖ, నంద్యాల మున్సిపల్ మున్సిపాలిటీ వారు చక్కగా విధులు నిర్వహించారని కొనియాడారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడంలో కృషి చేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు, ఆలయ సిబ్బందికి, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, ఏఈఓఓ వెంకటేశ్వర్లు, వేద పండితులు రవిశంకర అవధాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఒ



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, శివరాం

కార్మికులకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్యాపిలి

గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నందు యూనియన్ నాయకులు నెట్టేకల్లు అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలను శుభ్రం చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుతూ ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా సేవలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని అయితే వారు మాత్రం చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని తదతర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. **నూతన కమిటీ ఎన్నిక :** గౌరవాధ్యక్షులుగా టి.శివరాం సిఐటియు, అధ్యక్షులు ఎస్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు బి.నెట్టకల్లు, ప్రధాన కార్యదర్శి పి.బి.మహేంద్ర, సహాయ కార్యదర్శి డి.రఘు, కోశాధికారి పి.అరుణ్ లతో పాటు ఎస్.నూర్ మహమ్మద్, ఎస్.ఖాజా, ఎన్.బ్రహ్మయ్య, జె.రామాంజనమ్మ, ఎన్.ఓబులమ్మ,సి.ఆదిలక్ష్మి, బి.ఈరమ్మ,యు. లక్ష్మీదేవిలను కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి చేసిన వారిని ఆదరించాలి

- అర్జున్ అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - డోన్

అభివద్ధి చేసిన వారిని ప్రజలు ఆదరించాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి తనయుడు అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు.మంగళవారం డోన్ పట్టణంలోని 10,11 వార్డులలో అర్జున్ అమర్నాథ్ రెడ్డి పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించుకుంటూ తన తండ్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మరలా గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,కౌన్సిలర్ రమాదేవి,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్లు మౌలాభి,ఫాతిమాభి,నాగేంద్రమూర్తి,నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్,నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ టియి దినేష్ గౌడ్,పట్టణ యూత్ అధ్యక్షుడు ఆర్ఈ రాజవర్ధన్ గౌడ్,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,రాజేష్,శ్రీధర్ నాయుడు,ఫారెస్ట్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న అర్జున్ అమర్నాథ్ రెడ్డి

వైసిపి కౌన్సిలర్లలో ముసలం

టిడిపిలో చేరనున్న వైసిపి కౌన్సిలర్లు?
ఆత్మకూరు మున్సిపాలిటీ పై టిడిపి జెండా ఎగరనున్నదా?
ఈ అనుమానాలకు తెర పడేదెన్నడు ?



ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు అధికులు క్యాంపుకు వెళ్లారు. ఎక్కడికి క్యాంపుకు వెళ్లారు. మరి ఇప్పుడెందుకు వెళ్లారు. ఏదయినా మార్పు జరగనుందా అనే చర్చ ఆత్మకూరు పట్టణంలో ఆసక్తిరేపుతుంది. మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అధికార వైసిపికి 21మంది సభ్యులున్నారు. ఇద్దరు స్వతంత్రులు, ఒక టిడిపి సభ్యుడు ఉన్నారు. నలుగురు కోఆప్షన్ సభ్యులు కూడా ఉన్నారు. నాలుగునరేళ్ల పాలన దాటితే గాని అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. కాని ఇప్పుడే క్యాంపు రాజకీయాలు ఎంటనేదే చర్చ నడుస్తోంది. ఈ క్యాంపుల వ్యవహారం మొదలయి కూడా రెండు నెలలు దాటిపోతుంటున్నారు. ఎందుకబ్బా అని ప్రతి ఒక్కరిలో ఇదే చర్చ....

అలాంటిదేమి కాదట...అధికారపార్టీ శ్రీశైలం ఎమ్మెల్యే, ఆయన సుపుత్రుడు వ్యవహారశైలి నచ్చలేదని మున్సిపల్ కౌన్సిలర్లు అలిగారట. 11 మందికిపైగా వైసిపిని వీడి టిడిపిలో చేరే అవకాశం ఉందట. ఇలాంటివి జరిగితే విపక్షాలు చేస్తే సభ్యులను సస్పెండ్ చేసే అవకాశం కూడా లేకపోలేదని మరోచర్చ నడుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక టిడిపిలో చేరితే అధికారులంతా ఆపనిలో ఉంటారు కాబట్టి ఆసమయంలో టిడిపి చేరుతారని అనుకుంటున్నారు. ఎమ్మెల్యే కుమారుడు ఎందుకు ఈ వ్యవహారంలోకి వచ్చాడని చూస్తే తండ్రి ఎమ్మెల్యే అయినందున కుమారుడి పెత్తనం ఎంతో కొంత ఉంటుంది కదామరి. రాష్ట్ర ప్రభుతం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు దుస్తులు, క్రీడా సామాగ్రి పంపిణీ సమయంలో నియోజకవర్గంలో అంతా ఎమ్మెల్యే తనయుడు కిట్లుపంపిణీ సందర్భంగా ఆత్మకూరు కౌన్సిలర్లపై పత్తనం చెలాయించారట. ప్రతి కౌన్సిలరు 50 మందికి తగ్గకుండా సమావేశాలకు పిలువాలన్నారట. తక్కువ మందిని సమీకరించిన కౌన్సిలర్లతో దురుసుగా మాట్లాడటం. కిట్లను, ఖర్చులకు డబ్బులు ఇచ్చేప్పుడు కౌన్సిలర్లను కాదని కింది క్యాడరుకు ప్రాధాన్యత ఇవ్వడం నచ్చలేదట. అందుకే కౌన్సిలర్లు అధికార పార్టీని వదిలి ప్రతిపక్షపార్టీ టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. మెజార్టీ కౌన్సిలర్లు గత మూడు నెలల నుండి ప్రభుత్వ కార్యక్రమాలకు వైసిపి కార్యక్రమాలకు చైర్మన్‌తో సహా కోఆప్షన్ సభ్యులు దూరంగా ఉంటూ వస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ ఇసాక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా సైతం కృషి చేసినప్పటికీ కౌన్సిలర్లు వైసిపిలో ఉండలేమని వారితో తెగేసి చెప్పినట్లు సమాచారం. గత కొంతకాలంగా కొందరు కౌన్సిలర్లు క్యాంపుల్లో ఉన్నారు. తిరిగి వారిని పార్టీ వైపు వచ్చే విధంగా నచ్చజెప్పేందుకు పలువురు వైసిపి నాయకులు ప్రయత్నించినప్పటికీ వారి కషి ఫలించలేదు.

పార్టీపై విధేయత ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేపైన పార్టీలో కొందరు కౌన్సిలర్లకు అసంతృప్తి ఉన్నదన్న విషయం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మెజార్టీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరినట్లయితే అసెంబ్లీ ఎన్నికల ముందే ఆత్మకూరు మున్సిపాలిటీపై తెలుగుదేశం జెండా ఎగిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాబోవు అసెంబ్లీ ఎన్నికల ముందే ఏకంగా ఒక మున్సిపాలిటీ ప్రతిపక్షం చేతుల్లోకి వెళుతున్నదా అన్న అనుమానాలు ఆత్మకూరు పట్టణంలోని ప్రజల్లో ఉన్నది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అగ్ర నాయకులు సమక్షంలోని వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అసమ్మతి కౌన్సిలర్లను వివిధ రూపాల్లో తమ దారిలోకి తెచ్చుకొని వారిపై ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆ ఒత్తిడికి వారు దీటుగా ఎదుర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికే క్యాంపులో ఉన్న అసమ్మతి్గ కౌన్సిలర్లు రాబోయే రెండు మూడు రోజుల్లో తమ అనుచర ప్రజలతో విజయవాడలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మెజార్టీ కౌన్సిలర్లు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరితే ఆ ప్రభావం రాబోవు ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం తోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు నియోజవర్గంలో ఉండవచ్చనుకుంటున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన మెజార్టీ ఎంపిటిసిలు సైతం తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. వైసిపిని వీడేందుకు సిద్ధమైన ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ఎంపిటిసి సభ్యులను అధికార పార్టీ నాయకులు ఎలా దారిలోకి తెచ్చుకుంటారని ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. ఏమైనప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపే శ్రీశైలం నియోజకవర్గంలో రాజకీయ మార్పులు జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది.

ప్రభుత్వం మహిళలకు పెద్దపీట

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



గడివేముల : మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం గడివేముల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగవ విడత వైయస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, జడ్పిటిసి ఆర్ .బి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.5 కోట్ల 16 లక్షల చేయూత చెక్కును మహిళలకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. పథకాలు రావాలంటే మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మండలంలో మహేంద్ర రకం జొన్నలను కచ్చితంగా కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేపిస్తామని అన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శివరామిరెడ్డి, పొదుపు లక్ష్మి సెక్రెటరీ అనురాధ, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైసిపి నాయకులు పోగుల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శిరుప శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, దేశం సంజీవరెడ్డి, దుర్వేసి బండపల్లి రమేష్, ఈఓఆర్డి కాలిక్ భాషా నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

మిడుతూరు : మిడ్తూరు మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో జరిగిన వైస్సార్ చేయూత కార్యక్రమంలో వైసిపి నందికొట్కూరు సమన్వయకర్త ధారా సుధీర్ బాబు, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జడ్పీటీసీ యుగేందర్ రెడ్డి, ఎంపీపీ వెంకటేశ్వరమ్మా, సొసైటీ చైర్మయిన్ తులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, లబ్దిదారులకు రూ.503.44 లక్షల మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం వచ్చిన మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభి షేకం చేశారు.

ప్యాపిలి : స్థానిక షాదీ ఖానాలో వైయస్సార్ చేయూత కార్యక్రమంలో రూ.8 కోట్ల ఒక లక్ష 75 మెగా చెక్కును మీట్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పిటిసి శ్రీరామారెడ్డి తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సాయి మనోహర్, రామచంద్రారెడ్డి, నేరేడుచర్ల చంద్ర, ఏపిఎం కృష్ణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.



మిడుతూరు : మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం



ప్యాపిలి : మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్

ఢిల్లీ బహిరంగ సభకు మద్దతు తెలపాలి

-ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యాకాసం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరావు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 540 రైతు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 14వ తేదీ ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు ప్రజలు మద్దతు తెలుపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు కోరారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో రైతు, వ్యాకాస, సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి పిపకీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో రాతపూర్వకంగా సంయుక్త కిసాన్ మోర్చ నాయకత్వానికి ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరుతూ ఢిల్లీ బయలుదేరిన రైతు నోగాన్ని హర్యానా సరిహద్దుల్లో నే అడ్డగించి, కందకాలు తవ్వడం, మేకులు నాటడం, భారీ గేట్లు ముల్లకంచెలు ఏర్పరచడం, వాటర్ క్యా నున్ల, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడంతో పాటు డ్రోన్ల ద్వారా విషవాయువులు చిమ్మించిందన్నారు. పోలీస్ కాల్పులలో శుభారా కరణ్ సింగ్ అనే యువరైతు, మరో ముగ్గురు రైతులు గుండె ఆగి చనిపోయారని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని ఆదాని, అంబానీ, తదితర కార్పొరేట్ కంపెనీల అస్తగతం చేయడాని కె కంకణం కట్టుకుందన్నారు. మార్చి 14న చలో ఢిల్లీ సందర్భంగా జిల్లాల్లో అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్య్ర కమంలో రైతు, వ్యాకాస, సిఐటియు నాయకులు టి గోపాలకృష్ణ, ఆకుల రాము, శివ రాముడు, కొంగర వెంకటేశ్వర్లు, బుల్లెద్దుల ఏసేపు, త్యాగరాజు,పి గోకారి, పి నబి భాష తదితరులు పాల్గొన్నారు.

జాబ్ రావాలంటే బాబు రావాలి : టిడిపి

ప్రజాశక్తి-డోన్

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు జాబ్ రావాలంటే టిడిపి అధినేత చంద్రబాబు అధికారంలోకి రావాలని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 21,22 వార్డులలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యవసర ధరలు పెరిగి సామాన్యులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యుత్, ఆర్టీసీ బస్సు చార్జీలు,గ్యాస్ ధరలు పెంచేసి ప్రజల జేబులను గుల్ల చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో పోటీలో దిగిన టిడిపి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మీ ఆశీస్సులు అందించి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎన్ఈసరోజ,రాష్ట్ర కార్యదర్శి పణిరాజ్, మద్రిరమణ, ఓంప్రకాష్, కేఈ.శ్యామ్, భాష్యం శ్రీధర్ గౌడ్, భాష్యం శ్రీనివాసులు గౌడ్,గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి కార్యకర్తలు

డోన్ మండలంలోని వెంకటనాయుని పల్లె గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. పట్టణంలోని టిడిపి నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి నివాసంలో డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత రెడ్డి సమక్షంలో 50 మంది టిడిపిలో చేరారు. కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టియి కేశన్నగౌడ్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్రికే పణిరాజ్, న్యాయవాది భాస్కర్ నాయుడు,వెంకట నాయుడు పల్లె సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు,చిట్యాల మద్దయ్య గౌడ్,చాటకొండ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వెంకటనాయునిపల్లె వైసిపి కార్యకర్తలు

వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

- పాణ్యం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

పరిపాలన చేతగాని జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పాణ్యం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం కరిమద్దల గ్రామంలో టిడిపి నాయకులు మాజీ మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కత్తి శివారెడ్డి నేతృత్వంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటి వద్ద కరపత్రాలను పంచి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాణ్యం నియోజక వర్గంలో తెలుగుదేశం జెండా ఎగురవేసి పాణ్యం ఎమ్మెల్యే సీటును చంద్రబాబుకు కానుకగా ఇద్దామని అన్నారు. మండల టిడిపి నాయకులు దేశం సత్యనారాయణరెడ్డి, వంగాల మురళీమోహన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్రీనివాస యాదవ్, రాచమల్ల శ్రీనివాసులు, కంది శ్రీనివాసులు, హర్షవర్ధన్, మాజీ జెడ్పిటిసి సీతారాం రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బత్తుల సుభద్రమ్మ, తెలుగు మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డు లక్ష్మీదేవి టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరు చరిత రెడ్డి

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండ లంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాన్ని, కడమల కాలంలో హెల్త్ క్లినిక్‌ను, ఈర్నపాడులో వైయస్సార్ హెల్త్ క్లినిక్, బండి ఆత్మకూరులో సచివాలయం-1, పెద్ద దేవలాపంలో బహుళ ప్రయోజనాల గోదాము ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి బండి ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేశు వెంకట్రామిరెడ్డి, ఏపీ సిడిపిఎల్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ వైకాపా రాష్ట్ర కార్యదర్శి శశికళ రెడ్డి, డి మద్దిలేటి రెడ్డి, శివారెడ్డి, వైకాపా మండల కన్వీనర్ బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ రాగల వెంకటరమణ, బండి ఆత్మకూరు సర్పంచ్ ఎరుకలు సంధ్య, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరెడ్డి, వైకాపా యువ నాయకుడు దీప్ కాంత్ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు గూడెం శివలింగం, వెలుగోడు బ్రాంచ్ మేనేజర్ నారాయణ రెడ్డి, సీఈవో గోపాల్, డి చిన్నబాబు, చిన్న నారాయణరెడ్డి, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సిఐలు నాగభూషణం, లక్ష్మీనారాయణ



పాములపాడు ప్రధాన రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కావత్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజలు తమ ఓటు హక్కును శాంతియుతం వాతావరణంలో ఉపయోగించుకోవాలని ఆత్మకూర్ టౌన్ అర్బన్ సిఐలు నాగభూషణం, లక్ష్మీనారాయణలు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలో బిఎస్ఎఫ్, స్థానిక పోలీసులతో పట్టణంలో కవాతు నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ నందు ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించే సందర్భంలో ఎవరైనా అడ్డగించిన అలాంటి వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటికే అసాంఘిక కార్యక్రమంలో పాల్గొనే వారిని గుర్తిస్తున్నామని వారిపై రౌడీ షీటర్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

పాములపాడు మండల కేంద్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో కావత్ నిర్వహించారు. ప్రధాన సెంటర్లో ఎస్సై జి అశోక్ ఆధ్వర్యంలో ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ యాదవ్, అర్బన్ సీఐ లక్ష్మి నారాయణలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీస్ శాఖ నిస్వార్ధంగా ప్రజలకు ఎలాంటి అవసరాలకైనా ఎన్నికల సమయంలో అండగా ఉంటుందన్నారు తమ తమ గ్రామాలలో ప్రాంతాలలో ఎక్కడ అల్లుళ్లకు పాల్పడకుండా ఓట్లను నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, పాములపాడు ఎస్సై జి అశోక్, కొత్తపల్లి ఎస్సై హరిప్రసాద్ అమలాపాల్, సిబ్బంది కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ 5.16 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం హుండీ లెక్కింపు చేయగా నగదు రూ 5,16,84,417 లు లభించాయని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పెద్దిరాజు మంగళవారం తెలిపారు. ఇందులో భక్తులు 13 రోజులలో హుండీలలో చెల్లించుకున్న కానుకలు ఆలయంలోని హుండీ ద్వారా రూ.5,08,66,006 లభించగా అన్న ప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.8,18,411 లభించాయి. మొత్తం రూ 5,16,84,417 లభించాయి. వీటితోపాటు బంగారం 122 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి ఐదు కేజీల 900 గ్రాములు లభించాయి. అంతేకాక విదేశీ కరెన్సీలు యు.ఎస్.ఎ డాలర్లు 240, సింగపూర్ డాలర్ 25, మలేషియా రింగ్ ట్స్ 2, ఆస్ట్రేలియా డాలర్లు 30, యూకే పౌండ్లు 30, యూఏఈ దిరహంస 20, మొదలైన విదేశీ కరెన్సీలు హుండీలో లభించాయి. ఈ హుండీ లెక్కింపు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాలు నిఘా మధ్య లెక్కింపు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్ రవణమ్మ, ఆయా యూనిట్ పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు, పాల్గొని లెక్కించడం జరిగిందని ఈ ఓ తెలిపారు.



హుండి లెక్కిస్తున్న దృశ్యం



నందికొట్కూరు టౌన్ : జెండాను ఆవిష్కరిస్తున్న సుధీర్



ప్యాపిలి : వైసీపీ కార్యాలయంలో..



బేతంచెర్ల : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి



పాములపాడులో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి



కొత్తపల్లిలో వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా వైసిపి ఆవిర్భావ వార్షికోత్సవం

5వ పేజీ తరువాయి.. తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరంలోని అమ్మవారి శాల నాలుగు రోడ్ల కూడలిలో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్ఆర్, సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాల ముందు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సచివాలయ మండల కన్వీనర్ పాణ్యం నాగేష్, యువ నాయకులు హరి నారాయణ, బైరి బ్రహ్మం, దేవగుడి జాకీర్ హుస్సేన్, చంద్రశేఖర్ రెడ్డి, మదర్ సాహెబ్, బాల్లీశ్వర్ రెడ్డి, జయరాముడు, మధుసూదన్, రమణ, డిష్ భాస్కర్, నెంబర్ వన్ హుస్సేన్, ఏరువా కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దార సుధీర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్, ఎంపీపి, పట్టణ అధ్యక్షులు, పట్టణ వైసిపి నాయకులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. డాక్టర్ దార సుధీర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఉపాధ్యక్షులు చింతా విజ్జి, ఉపేంద్ర రెడ్డి, మైనారిటీ జోనల్ ఇంచార్జి అబూబక్కర్, కో - ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, మాజీ కో- ఆప్షన్ సభ్యులు జబ్బార్, నందికొట్కూరు జెసియస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, కౌన్సిలర్ లు కాటెపోగు చిన్నరాజు, చాంద్ భాష, చెరుకు సురేష్, సురేష్ యాదవ్, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డా వైసిపి నాయకులు బద్దుల శ్రీకాంత్, రవింద్రా రెడ్డి, ఆశాం, కురువ శ్రీను, రైతు సంఘం బాబు, ఆర్ట్ శ్రీను, కోకిల రమణారెడ్డి, రజిని కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, బోయ శేఖర్, సలామ్, వి.ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** స్థానిక వైసీపీ కార్యలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పిటిసి శ్రీరామారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ బోర మల్లికార్జున రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి,కొలిమి బషీర్,శ్రీనివాసరెడ్డి, రామాంజి, మద్దయ్య,షాషావలి, జకీర్, సంజీవరెడ్డి,శీను, రామూర్తి,నాగరాజు, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి మండల వైయస్సార్ కాంగ్రెస్ కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ సోహెల్ల ఆధ్వర్యంలో స్థానిక మహబూబ్ వలి కాలనీలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి పెద్దమ్మ కాణం వీధిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపీటీసీ ఫయాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్బాషా, పార్టీ యువజన సంఘ అధ్యక్షుడు పెయింటర్ షరీఫ్, విద్యా కమిటీ చైర్మన్లు అబ్దుల్లా మహబూబ్ సున్నా వార్డు సభ్యుడు బ్రాందీన్ వైసిపి నాయకులు మదర్ వలి, ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** పట్టణంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్ కాజా హుస్సేన్, ఎస్ మూర్తి జావలి మాట్లాడారు. కార్యక్రమంలో వై సురేంద్రనాథ్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, వైయస్ ఆర్పి కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు నాగరాజు జాకీర్ సుందర్రాజు భాస్కర్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు మండల కేంద్రంలో వైయస్సార్ విగ్రహానికి నందికొట్కూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధారా సుధీర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల వైసిపి అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బెడ్లు పండ్లు పంపిణీ చేశారు. **కొత్తపల్లి :** ప్రభుత్వం నుంచి వస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించి వైఎస్ఆర్సిపి పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరం కలిసి కృషి చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కె సుధాకర్ రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ముందుగా గాంధీ, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైఎస్సార్సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, కో-ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపీటీసీలు బాలరాజు, శివన్న, జగనన్న ఇళ్లస్థలాల మండల కో- ఆర్డినేటర్ పరశు రాముడు, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చింతమాను శ్రీనివాసులు యాదవ్, మొల్ల బాషా, లింగారెడ్డి, ఏసేపు, జయన్న, యేసురావు, నారాయణ రెడ్డి, మద్దిలేటి యాదవ్, రవీంద్రా రెడ్డి, రామిరెడ్డి, రహంతుల్లా, రామకష్ణ, కొక్కెరంచ రవీంద్రా రెడ్డి, నందిశ్వర రెడ్డి, జయరాం గౌడ్, నంద్యాల ఉస్మాన్, నాగన్న, నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రి : పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం